సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం ׀ 1 ׀ డిసెంబర్ ׀ 2023

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాం..

సైబరాబాద్‌లో మొత్తం 3,202 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ముందస్తు అరెస్టులు, బైండోవర్లు, కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు వంటి కారణాలతో ఈసారి కమిషనరేట్ పరిధిలో ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 6,400 మందితో బందోబస్తు నిర్వహించాం.

– స్టీఫెన్ రవీంద్ర, సైబరాబాద్ సీపీ

కేంద్ర బలగాల పహారాలో స్ట్రాంగ్ రూమ్‌లు

ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈవీఎంలను కేంద్ర బలగాల పహారాలో స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాం. ఎన్నికల ఫలితాలు పూర్తయ్యే వరకూ రాచకొండ పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి.



– డీఎస్ చౌహాన్, రాచకొండ సీపీ



ఆమనగల్లు: ఖానాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు



ఆమనగల్లు: ఓటు వేస్తున్న కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి



కడ్తాల్: చల్లంపల్లిలో కల్వకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్



షాద్‌నగర్: ఓటు వేసినట్టు సిరా గుర్తు చూపుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్‌నగర్: ఓటు వేసినట్టు సిరా గుర్తు చూపిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి



షాద్‌నగర్: కిషన్‌నగర్‌లో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధురాలు





కడ్తాల్: మైసిగండిలో బారులు తీరిన మహిళా ఓటర్లు (ఇన్‌సెట్) తొలిసారి ఓటు వేసిన యువతి



మీర్‌పేట: తొలిసారి ఓటు వేసిన యువతి

భవితవ్యం @ ఈవీఎం

చెదురు మదురు ఘటనలు మినహా అంతా ప్రశాంతం

- పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు
- ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్
- ఉదయం మందకొడిగా మొదలై.. మధ్యాహ్నం తర్వాత పుంజుకుని..
- సాయంత్రం 5 గంటలకు వరకు 59.96 శాతం ఓటింగ్ నమోదు
- పోలీసు భద్రత మధ్య స్ట్రాంగ్‌రూంలకు ఈవీఎంల తరలింపు
- 3న తేలనున్న అభ్యర్థుల జాతకం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చెదురు ముదురు ఘటనలు మినహా జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైన తర్వాత పలు ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించాయి. పోలింగ్ కొంత ఆలస్యం కాగా సాంకేతిక సిబ్బంది వెంటనే ఆయా కేంద్రాలకు చేరుకుని వాటిని పునరుద్ధరించడంతో యథావిధిగా కొనసాగింది. ఐదు గంటలలోపు పోలింగ్ కేంద్రానికి చేరుకుని, క్యూలైన్లలో నిలబడిన వారికి కూడా అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ ప్రారంభ సమయంలోనే జనం భారీగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్నం మూడు గంటల వరకు 42.43 శాతం ఓటింగ్ నమోదు కాగా, సాయంత్రం ఐదు గంటల వరకు 59.96 శాతానికి చేరుకుంది. సాయంత్రం ఐదు తర్వాత కూడా ఓటర్లు బారులు తీరి ఉండడంతో పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది.

ఆయా నియోజకవర్గాల్లో ఇలా..

- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఖానాపూర్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు లాఠీలకు పని చెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.
- రాజేంద్రనగర్ నియోజకవర్గం మణికొండలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వివాదం తలెత్తింది. పోలీసులు లాఠీలకు పని చెప్పాల్సి వచ్చింది.
- మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి, శ్రీరాంకాలనీ, మామిడిపల్లిలో దొంగ ఓట్లు వేస్తున్నారనే ప్రచారంతో ఆయా కేంద్రాల వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది.
- షాద్‌నగర్ నియోజకవర్గం చటాన్‌పల్లి 162 పోలింగ్ బూత్‌లో ఒకరి ఓటు మరొకరు వేయడం వివాదానికి కారణమైంది. పోలింగ్ సిబ్బంది ఏం చేస్తున్నారని బాధిత ఓటరు పోలింగ్ కేంద్రం ముందు ఆందోళనకు దిగారు.

మొరాయించిన ఈవీఎంలు

- కల్వకుర్తి నియోజకవర్గం మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి 222 బూత్‌లోని ఈవీఎం మొరాయించింది.
- మహేశ్వరం నియోజకవర్గం పహాడీషరీఫ్‌లోని 32వ బూత్(ప్రభుత్వ పాఠశాల)లో ఈవీఎం మొరాయించింది.
- రాజేంద్రనగర్ నియోజకవర్గం గొల్లపల్లి పోలింగ్ కేంద్రంలోని ఈవీఎంలో సాంకేతిక సమస్య తలెత్తింది. రెండు గంటల పాటు పోలింగ్ నిలిచి పోయింది. శాతంరాయి పోలింగ్ బూత్ నంబర్ 442లోనూ అరగంట పాటు ఆలస్యంగా మొదలైంది.
- శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి జెడ్పీహెచ్ఎస్ 401 పోలింగ్ బూత్ సహా మియాపూర్‌లోని 184 పోలింగ్ బూత్‌లలోని ఈవీఎంలోనూ సాంకేతిక సమస్య తలెత్తింది.
- చేవెళ్ల మండలం కమ్మెట పోలింగ్ కేంద్రంలోని ఈవీఎంలో ఓటు వేస్తుండగా బటన్ మొరాయించడంతో సాంకేతిక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని పునరుద్ధరించారు.

మందకొడిగా ప్రారంభమై..

- పట్టణ ప్రాంతాల్లో ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం తర్వాత పుంజుకుంది.
- ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లోని పలు కేంద్రాల్లో సాయంత్రం ఓటర్లు క్యూ కట్టారు.

ఈవీఎంల తరలింపు

సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ సిబ్బంది ఈవీఎంలను సీజ్ చేశారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య వాటిని ఎంపిక చేసిన కేంద్రాలకు తరలించారు. ఇబ్రహీపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలోని ఈవీఎంలను సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించగా, ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని ఈవీఎంలను సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు, శేరిలింగం పల్లి నియోజకవర్గం పరిధిలోని ఈవీఎంలను గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. రాజేంద్రనగర్, షాద్‌నగర్, చేవెళ్ల పరిధిలోని ఈవీఎంలను అప్పా జంక్షన్ సమీపంలోని లార్డ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. సీసీ కెమెరాల నిఘాలో, కట్టుదిట్టమైన పోలీసు భద్రత మధ్య ఈవీఎంలను ఆయా కేంద్రాల్లో భద్రపరిచారు. ఈ నెల 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టనున్నారు.

ఎవరెక్కడ ఓటు వేశారంటే..

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి మొయినాబాద్ మండలం ఎన్కెపల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూల్లోని 142లో పోలింగ్‌బూత్‌లో ఓటు వేశారు.
- సినీ నిర్మాత బండ్ల గణేశ్ షాద్‌నగర్లోని 248 పోలింగ్ బూత్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి తన సొంతూరైన చేవెళ్ల మండలం కౌకుంట్లలో, కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి శంకర్‌పల్లి మండలం మాసానిగూడలో, బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ నాదర్‌గుల్ అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో 286 పోలింగ్ బూత్‌లో కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- షాద్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్ కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటలో, కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ నందిగామ మండలం వీర్లపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- కల్వకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి గుర్క జైపాల్ యాదవ్ కడ్తాల్ మండలం చల్లంపల్లిలో, కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో, బీజేపీ అభ్యర్థి తల్లోజు ఆచారి ఆమనగల్లులో ఓటు వేశారు.
- ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎలిమినేడులో కుటుంబ సభ్యులతో కలిసి ఓటును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రాంరెడ్డి హయత్‌నగర్ మండలం తొర్రూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఓటేశారు.
- శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ వివేకానందనగర్‌లోని క్లబ్‌హౌస్‌లో, కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ నల్లగండ్లలో 33 పోలింగ్ బూత్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- ఎల్బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ మారుతీనగర్ ఎస్ఎస్ఎస్ విద్యానికేతన్ పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.



మొయినాబాద్‌రూరల్: కేతిరెడ్డిపల్లిలో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం దంపతులు



షాద్‌నగర్: ఓటు వేసిన బీజేపీ అభ్యర్థి అందె బాబయ్య దంపతులు



మొయినాబాద్ రూరల్: ఎన్కెపల్లిలో ఓటు వేసిన ఎంపీ రంజిత్‌రెడ్డి



కలెక్టర్: జూబ్లీహిల్స్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ భారతి హోళికేరి



తాండూరులో ఓటు వేసిన మంత్రి మహేందర్‌రెడ్డి



తుర్కయంజాల్: ఓటు వేసిన ఇబ్రహీంపట్నం బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్ గౌడ్



షాబాద్: కుమ్మరిగూడలో ఓటు వేసిన చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్



చేవెళ్ల: కౌకుంట్లలో కుటుంబసభ్యులతో వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్న మంత్రి సబితారెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్ : ఎల్మినేడులో ఓటు వేసిన బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మహేశ్వరం: ఓటు వేసినట్టు సిరా గుర్తు చూపిస్తున్న బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్



చేవెళ్ల: చించల్‌పేటలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేసినట్లు చూపిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



శంకర్‌పల్లి: మాసానిగూడలో ఓటు వేస్తున్న మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్



హయత్‌నగర్: ఓటు వేసిన ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు


షాద్‌నగర్: కుటుంబ సమేతంగా ఓటు వేసిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డి


మీర్‌పేట: జిల్లెలగూడలో క్యూలో నిల్చున్న వృద్ధురాలిని ముందుగా ఓటు వేయించాలని సిబ్బందికి సూచిస్తున్న మంత్రి సబితారెడ్డి


చేవెళ్ల: మీర్జాగూడలో ఓటుహక్కు వినియోగించుకున్న కుటుంబ సభ్యులు

పోలింగ్ ప్రశాంతం

అసెంబ్లీ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. 59.96 శాతం పోలింగ్ నమోదై.. సుఖాంతం అయింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. వయసు, ఆరోగ్యం సహకరించకపోయినా.. పెద్దలు, దివ్యాంగులు తమ బాధ్యతను నెరవేర్చుకున్నారు. కొత్తగా అర్హత పొందిన యువత ఉత్సాహంగా ఓటు వేశారు. అనంతరం తమ వేలికి ఉన్న సిరా గుర్తును చూపించి మురిసిపోయారు. మంచి నాయకున్ని ఎన్నుకునే అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. అధికార పార్టీ మహేశ్వరం అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి మీర్‌పేట పరిధి జిల్లెలగూడ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. క్యూలో నిల్చున్న వృద్ధురాలిని చూసి, ముందుగా ఓటు వేయించాలని అక్కడి సిబ్బంది సూచించారు.

– సాక్షి, నెట్‌వర్క్


కందుకూరు: గుమ్మడవెల్లిలో తమ ఓటు గురించి ఆరా తీస్తున్న ఓటర్లు


కందుకూరు: పులిమామిడిలో కొత్తగా ఓటు వేసిన యువతులు


చేవెళ్లలో మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతి


యాచారం: ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి దంపతులు


ఆమనగల్లు: తొలిసారి ఓటు వేసిన సదాఫ్, డిగ్రీ విద్యార్థిని


ఆమనగల్లు: ఓటు వేసేందుకు చంటి పిల్లాడితో వచ్చిన మహిళ


కొందుర్గులో తొలిసారిగా ఓటు వేసిన మమత


కొందుర్గులో వృద్ధుడిని తీసుకెళ్తున్న కుటుంబీకులు


హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లో తొలిసారిగా ఓటు వేసిన భార్గవి


కొత్తూరు: మొదటిసారి ఓటు వేసిన నందిని


ఇబ్రహీంపట్నం.. రాయిపోల్‌లో దివ్యాంగుడు


యాచారం: వృద్ధురాలిని స్ట్రేచర్‌పై తీసుకవస్తున్న పంచాయతీ సిబ్బంది

ఒకరికి బదులు మరొకరు ఓటు

ఫిర్యాదు చేసిన మహిళ

షాద్‌నగర్‌రూరల్: తన ఓటును వేరేవారెవరో వేశారని ఆరోపిస్తూ ఓ మహిళా ఓటరు ఎన్నికల అధికారులు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధి చటాన్‌పల్లి పోలింగ్ కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బ్యాగరి బాలమణికి 162 పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు ఉంది. అదే గ్రామానికి చెందిన మరో మహిళ బాలమణికి 163 పోలింగ్ కేంద్రంలో ఓటు ఉంది. అయితే ఈ రెండు పోలింగ్ కేంద్రాలను అధికారులు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. 163 పోలింగ్ బూతులో ఓటు వేయాల్సిన బాలమణి.. 162లో వేసింది. 162 పోలింగ్ బూతులో ఓటు వేసేందుకు వచ్చిన బ్యాగరి బాలమణికి.. ఓటు హక్కు వినియోగించుకున్నావని అధికారులు చెప్పడంతో ఆశ్చర్యపోయింది. ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వాలని ఆమె అధికారులను కోరింది. తన పేరు మీద ఉన్న ఓటును ఇతరులు వేయడం ఏమిటని ప్రశ్నించింది.


ఆధార్ కార్డు, ఓటరు స్లిప్‌ను చూపిస్తున్న బ్యాగరి బాలమణి

గ్రామాల్లో మొరాయించిన ఈవీఎంలు

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. చెదురు, మదురు ఘటనలు మినహా ఎక్కడ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. ఉదయం 7 నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. రాత్రి 7 గంటలు దాటినా ఓటర్లు వరుసలో నిల్చున్నారు. మధ్యాహ్నం 3 గంటల వరకు దాదాపు అన్ని కేంద్రాల్లో 60 శాతం పోలింగ్ దాటింది. కొందుర్గు మండలం, జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధి పలు గ్రామాల్లో పోలింగ్ 90 శాతం దాటింది. కాగా కొందరు తదితర ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడంతో కొంతమేర అంతరాయం కలిగింది. దీంతో కొద్దిసేపు ఓటర్లు కేంద్రం ఆవరణలో కూర్చున్నారు.


కేంద్రం ఆవరణలో కూర్చున్న ఓటర్లు

ఓవర్ టు స్ట్రాంగ్ రూమ్స్

- నగర కమిషనరేట్‌లో 15 చోట్ల ఏర్పాటు
- పటిష్ట భద్రత ఏర్పాటు చేసిన పోలీసులు
- కేంద్ర, రాష్ట్ర, నగర బలగాలతో పహారా

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల్లో తుది ఘట్టమైన కౌంటింగ్‌కు రెండు రోజుల గడువు ఉండటంతో పోలీసు బందోబస్తు డ్యూటీ స్ట్రాంగ్ రూమ్స్ వద్దకు మారింది. ఈవీఎం మిషన్లను గురువారం రాత్రికి వీటిల్లోకి తరలించి భద్రపరిచారు. నగర పరిధిలోని 15 చోట్ల స్ట్రాంగ్ రూమ్స్/కౌంటింగ్ కేంద్రాలు ఉన్నాయి. దీంతో ఆదివారం కౌంటింగ్ సైతం ఇక్కడే జరగనుంది. పోలింగ్ నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటన లేకుండా చర్యలు తీసుకున్న పోలీసులు స్ట్రాంగ్ రూమ్స్ వద్దా ఇలాంటి ఏర్పాట్లే చేస్తున్నారు. ప్రధానంగా మూడంచెల భద్రత కల్పించడంతో పాటు కొన్ని అదనపు చర్యలూ తీసుకుంటున్నారు. వీటిని నగర కొత్వాల్ సందీప్ శాండిల్య స్వయంగా పర్యవేక్షించారు.

స్ట్రాంగ్ రూమ్స్ భద్రతా ఏర్పాట్లిలా...

- స్ట్రాంగ్ రూమ్‌లకు కేవలం ఒకే ద్వారం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. రూమ్‌కు డబుల్ లాక్ సిస్టం ఏర్పాటు చేసి ఒకటి దాని ఇన్‌చార్జ్ వద్ద, మరోటి మెజిస్ట్రియల్ అధికారాలున్న అధికారి వద్ద ఉంచారు.
- స్ట్రాంగ్ రూమ్స్ వద్ద 24 గంటలూ సాయుధ గార్డును ఉంచడంతో పాటు అనునిత్యం సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు.
- స్ట్రాంగ్ రూమ్స్‌కు ఉండే మూడంచెల భద్రతలో తొలి అంచెలో (రూమ్ డోర్ దగ్గర) కేంద్ర సాయుధ బలగాలకు చెందిన వారు ఉంటున్నారు. దీనికోసం కనీసం ఒక సెక్షన్ (13 మంది) బలగాలు 24 గంటలూ అందుబాటులో ఉండేందుకు ఓ ప్లటూన్ (39 మంది) ప్రత్యేకంగా కేటాయించారు.
- రెండో అంచెలో రాష్ట్ర సాయుధ పోలీసులు, మూడో అంచెలో సాధారణ పోలీసు సాయుధ బలగాలను మోహరించారు.
- స్ట్రాంగ్ రూమ్స్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఐసీసీసీలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు (సీసీసీ) అనుసంధానించారు. అక్కడి దృశ్యాలను ఎప్పటికప్పుడు ఇక్కడి సిబ్బంది పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు.

నియోజకవర్గం	స్ట్రాంగ్‌రూమ్/కౌంటింగ్ కేంద్రం
ముషీరాబాద్	ఏవీ కాలేజ్, దోమలగూడ
మలక్‌పేట	అంబర్‌పేట ఇండోర్ స్టేడియం
జూబ్లీహిల్స్	కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, యూసుఫ్‌గూడ
సనత్‌నగర్	కాలేజ్ ఆఫ్ కామర్స్, ఓయూ
నాంపల్లి	ఫైన్ ఆర్ట్స్ కాలేజీ, మాసబ్‌ట్యాంక్
కార్వాన్	గవర్నమెంట్ పాలిటెక్నిక్, మాసబ్‌ట్యాంక్
గోషామహల్	కోఠి ఉమెన్స్ కాలేజ్
చార్మినార్	కమల నెహ్రూ పాలిటెక్నిక్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్
చాంద్రాయణగుట్ట	నిజాం కాలేజ్, బషీర్‌బాగ్
యాకుత్‌పురా	వనిత మహా విద్యాలయ, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్
బహదూర్‌పురా	అరోరా లీగల్ సైన్సెస్ అకాడెమీ, బండ్లగూడ
సికింద్రాబాద్	పీజీఆర్ఆర్ సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఓయూ
కంటోన్మెంట్	వెస్లీ కాలేజ్, సికింద్రాబాద్
ఖైరతాబాద్	కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, యూసుఫ్‌గూడ
అంబర్‌పేట	రెడ్డి ఉమెన్స్ కాలేజ్, వైఎంసీఏ


కొత్తూరు: ఇన్ముల్‌నర్వలో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఏసీపీ రాంచందర్‌రావు


చేవెళ్ల: పామెన గ్రామంలో ఓటు వేసిన యాంకర్ బిత్తిరి సత్తి

నియోజకవర్గంలో 56.10 శాతం పోలింగ్

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన పోలింగ్‌లో 56.10 శాతం పోలింగ్ నమోదైంది. శంషాబాద్, గండిపేట్, రాజేంద్రనగర్ మండల పరిధిలో 3,26,461 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో 1,69,622 మంది పురుషులు కాగా.. 1,56,850 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్లు 12 మంది, వికలాంగులు 15 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం మందకోడిగా ప్రారంభమైన పోలింగ్ 8 గంటల అనంతరం ఊపందుకుంది. ఉదయం 10 గంటలకు 18 శాతం పోలింగ్ నమోదు కాగా.. అనంతరం మందగించింది. మధ్యాహ్నం ఒంటిగంట అనంతరం ఓటర్లు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. పోలింగ్ గంట ముందు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రానికి రావడంతో పోలింగ్ శాతం పెరిగింది. పోలింగ్ సమయం ముగిసిన అనంతరం క్యూలైన్‌లో నిలబడిన వారందరికి ఓటుహక్కును కల్పించారు. సాయంత్రం 6.30 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడంతో కొత్తగా ఏర్పాటు చేసి పోలింగ్‌ను కొనసాగించారు. రాత్రి నియోజకవర్గంలో మొత్తం 56.10 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పోలింగ్ శాతం మధ్యాహ్నం అనంతరం పెరగడంతో గెలుపోటములపై ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు.

పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు

శంషాబాద్ : శంషాబాద్‌లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో కలిపి 66.7 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 87,256 ఓట్లకు 58,246 ఓట్లు పోలైనట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం, సాయంత్రం ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. మధ్యాహ్నం సమయం పోలింగ్ ప్రక్రియ బాగా నెమ్మదించింది. సాతంరాయి, గొల్లపల్లిలో ఈవీఎం యంత్రాలు మొరాయించాయి. ఎన్నికల ప్రక్రియను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ పరిశీలించారు. ఓటర్ల స్లిప్పులు పూర్తిగా అందకపోవడంతో ఓటువేయడానికి ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓటరు జాబితాలో ఓటులేని ఓటర్లు కూడా ఉసురుమంటూ తిరిగి వెళ్లిపోయారు.

రోడ్లన్నీ నిర్మానుష్యం

సాక్షి, సిటీబ్యూరో: శాసనసభ ఎన్నికల వేళ గ్రేటర్‌లో రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. ఓటు హక్కు వినియోగించుకునేందుకు నగరవాసులు సొంతూర్లకు వెళ్లిపోయారు. దీంతో నిత్యం వాహనాలతో కిక్కిరిసే ప్రధాన రహదారులన్నీ ఖాళీగా కనిపించాయి. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, ఐటీ కంపెనీలు ఉద్యోగులకు గురువారం సెలవు దినం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రధానంగా ప్రతి రోజు వాహనాలతో కిటకిటలాడే జూబ్లీబస్ స్టేషన్, సికింద్రాబాద్, బేగంపేట,అమీర్‌పేట్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్, రాజ్‌భవన్ రోడ్, లక్డీకాపూల్, హిమాయత్‌నగర్, సోమాజిగూడ, పంజగుట్ట, మాదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాలు గురువారం నిర్మానుష్యంగా మారాయి.

స్వదస్తూరీతో సందేశం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో తనకు సహకరించిన పోలీసులకు సీపీ సందీప్ శాండిల్య స్వదస్తూరీతో కృతజ్ఞతలు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన రాసిన సందేశం ఉన్న పేజీని నగర పోలీసు అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. దీన్ని అనేక మంది అధికారులు తమ స్టేటస్‌లుగా పెట్టుకున్నారు.

పర్యటనలు.. పర్యవేక్షణలు

పర్యవేక్షించిన అభ్యర్థులు, పోలీస్ అధికారులు

మణికొండ: అసెంబ్లీ ఎన్నికలను ఎప్పటికప్పుడు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రకాష్‌గౌడ్, కె. నరేందర్‌ముదిరాజ్‌లతో పాటు రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డిలు పర్యటిస్తూ.. పర్యవేక్షించారు. ప్రకాష్‌గౌడ్ మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పర్యటించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఓటు వేసేందుకు వస్తున్న వారు ఎక్కడి వారు, ఎటువైపు వారి ఓటు ఉండే అవకాశం ఉంటుందని నాయకులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూత్‌లలోకి వెళ్లి ప్రజలను పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్‌స్టేషన్లలో కొనసాగుతున్న పోలింగ్ సరళి, ఎలాంటి ఘటనలు జరగకుండా ఇతరులు పోలింగ్‌స్టేషన్లలో ఉండకుండా చర్యలు తీసుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌ముదిరాజ్ పలు పోలింగ్ స్టేషన్లలో పర్యటించారు.

మేము సైతం..

తొలిసారి ఓటు వేసేందుకు కదంతొక్కిన నవతరం

షాద్‌నగర్: ప్రజాస్వామ్య దేశంలో ఓటు కీలకం. అందులో యువత పాత్ర ఎనలేనిది. 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు ఈ సారీ ఎన్నికల సంఘం భారీగా ఓటు హక్కు కల్పించింది. దీంతో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు నవతరం కదంతొక్కింది. మంచి నాయకున్ని ఎన్నుకునేందుకు తమకు అవకాశం లభించిందంటూ హర్షం వ్యక్తంచేశారు. ఓటు వేసి వారివారి అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. వారి మాటల్లోనే..


కిషన్‌నగర్‌లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత

సంతోషంగా ఉంది



కొత్తగా ఓటు వచ్చినందుకు సంతోషంగా ఉంది. కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి రావడం ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది. పనిచేసే నాయకున్ని గుర్తించి, స్వేచ్ఛగా ఓటు వేశాను.

– సాయికుమార్, షాద్‌నగర్

ఓటు వజ్రాయుధం



ఓటు వజ్రాయుధం లాంటిది. కొత్తగా ఓటు హక్కు పొంది, హక్కు వినియోగించుకున్నాను. సరైన నేతను ఎన్నుకున్నప్పుడే పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆ దిశగా ఆలోచించి ఓటు వేశాను.

– శివకుమార్, ఫరూఖ్‌నగర్

ప్రజాస్వామ్యం బలోపేతం



ఓటు హక్కు సద్వినియోగం చేసుకుంటే సార్థకత అవుతుంది. ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుంది. ఓటు ద్వారా పాలకులను ఎన్నుకునే హక్కు రాజ్యాంగం కల్పించడం హర్షణీయం. బాధ్యతాయుతంగా ఓటు వేశాను.

– అక్షిత, షాద్‌నగర్

ఆనందంగా ఉంది



ఓటు హక్కు పొంది, మొదటి సారిగా ఓటు వేసినందుకు ఆనందంగా ఉంది. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉంది. స్వేచ్ఛగా ఓటు హక్కు ఉపయోగించుకున్నాను.

– భవానీ ప్రసాద్, ఎలికట్ట, ఫరూఖ్‌నగర్